క్లుప్తంగా

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్


నక్కలపల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లిలో గురువారం కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులు, గ్రామస్తులతో కలిసి రోడ్లను శుభ్రపరిచారు. పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామంలో ప్రజలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ, ఆశవర్కర్ యాదమ్మ, గ్రామ నాయకులు గౌరీ రవి, గోపాల్, వినయ్‌కుమార్, మాసుల మహేందర్, నర్సింలు, వెంకటయ్య, శంకరయ్య, మహేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ మిల్క్ పార్లర్ ప్రారంభం


విజయ మిల్క్ పార్లర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: మండల కేంద్రంలో విజయ మిల్క్ పార్లర్‌ను గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ సొసైటీ చైర్మన్ అమిత్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయ డెయిరీ ద్వారా రైతుల నుంచి స్వచ్ఛమైన పాలను సేకరించి, పాలతో తయారు చేసే పెరుగు, మజ్జిగ, కోవా, స్వీట్ తదితర పదార్థాలను ఈ పార్లర్‌లో విక్రయిస్తున్నామన్నారు. ఈ పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తామన్నారు. వినియోగదారులు గమనించి ప్రైవేట్ సంస్థల ప్రచారాలకు మోసపోకుండా విజయ ఉత్పత్తులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన మురళీ, మేనేజర్ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలని వినతి


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల: తలారం గ్రామానికి గతంలో వచ్చే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏడాదిగా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తిరిగి పునరుద్ధరించాలని గ్రామస్తులు, నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. మండలంలోని తలారం గ్రామానికి చెందిన గ్రామస్తులు, మహిళలు, గ్రామ నాయకులతో కలిసి గురువారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి గతంలో వచ్చే బస్సు సంవత్సర కాలంగా రావటం లేదన్నారు. గ్రామస్తులు బస్సులు ఎక్కాలంటే మండల కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరం ఉండగా.. ప్రధాన రోడ్డు ఆలూరు గేట్ లేదా చిట్టెంపల్లి గేట్ వద్దకు బస్సుల కోసం దాదాపు 7 నుంచి 8 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. గతంలో గ్రామానికి మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సు ఉదయం 9, సాయంత్రం 5, రాత్రి 10 గంటల సమయాల్లో మూడు ట్రిప్పులు బస్సు ఉండేదని తెలిపారు. దాదాపు సంవత్సర కాలంగా ఆ బస్సును నిలిపివేయటంతో నిత్యం ప్రజలు నరకయాతన పడుతున్నారని, వెంటనే మా గ్రామానికి బస్సు అయినా వేయించండి లేదా రోడ్డు బాగు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఆలూరు గ్రామస్తులు కూడా ఆలూరు బస్‌స్టేజీ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపేవిధంగా చూడాలని కోరటంతో ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్, గ్రామ నాయకుడు మానిక్యం, రైతులు ఉన్నారు.

పెరిగిన వాణిజ్యం.. తరిగిన ఆదాయం

అనుమతి లేకుండానే కొనసాగుతున్న దుకాణాలు

- కొత్త ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి పెట్టని అధికారులు
- రెన్యూవల్‌కు ముందుకు రాని వ్యాపారులు
- రాబడి కోల్పోతున్న మున్సిపాలిటీ



మున్సిపల్ కార్యాలయం

కొత్తూరు: మున్సిపాలిటీలు సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయంతో పాటు పురపాలిక సంఘానికి వచ్చే వచ్చే నిధులు మరింత పెరుగుతాయి. తద్వారా పట్టణ పరిధి వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు పుష్కలంగా ఉంటాయి. కానీ.. కొన్ని పట్టణాలు ఆదాయం సమకూర్చుకునేందుకు మార్గాలు ఉన్నప్పటికీ.. సంబంధిత అధికార యంత్రాంగం వాటిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా పథకాల నుంచి ప్రభుత్వం మంజూరు చేసే నిధులపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

దృష్టి సారించక.. లక్ష్యాన్ని చేరక

విస్తరిస్తున్న మున్సిపాలిటీలో.. అదే స్థాయిలో వ్యాపార సముదాయాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధి 12 వార్డుల్లో దాదాపుగా 400– 500 దుకాణాలు ఉన్నాయి. అందులో కిరాణ, దుస్తులు, హోటళ్లు, హార్డ్‌వేర్ తదితర వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా.. మున్సిపల్ అధికారుల లెక్కల మేరకు పురపాలికలో 358 ట్రేడ్ లైసెన్సులు జారీ చేయగా.. ఏడాదికి రూ.26.21 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా రూ.12.25 లక్షలు మాత్రమే వసూలు చేశారు. పూర్తిస్థాయిలో లైసెన్సుల రెన్యూవల్ చేపట్టకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరడం లేదు.

పర్మిషన్ లేకుండా వ్యాపారాలు

వ్యాపారులు విధిగా మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ పొందాలి. అధికారులు సైతం వాణిజ్య సముదాయాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. లైసెన్సులపై ఆరా తీయాలి. కానీ ఆ దిశగా అధికారులు అంతగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. దీంతో వాణిజ్య సముదాయాలు భారీగా ఉన్నప్పటికీ మున్సిపాలిటీకి ఆదాయం మాత్రం అంతగా రావడం లేదు. అనుమతులు పొందకుండానే కొందరు యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

నోటీసులు ఇస్తాం



మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వాణిజ్య సముదాయాలు, ఇతర సంస్థలు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ పొందాలి. అంతే కాకుండా ప్రతీ సంవత్సరం విధిగా రెన్యూవల్ చేసుకోవాలి. అనుమతులు పొందకుండా, ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తాం.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల ముందుకు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల పాలు చేశారని, రాచరికపు పాలనను కొనసాగించి ప్రజాధనాన్ని పూర్తిగా దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఇష్టం ఇచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కృష్ణ, మల్లేశ్, శివశంకర్‌గౌడ్, సుధాకర్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

పీఏసీఎస్ చైర్‌పర్సన్ మంజులారెడ్డి


మహాజన సభలో మాట్లాడుతున్న మంజులారెడ్డి

నందిగామ: రైతు సంక్షేమమే పీఏసీఎస్‌ల ప్రధాన ధ్యేయమని మేకగూడ పీఏసీఎస్ చైర్‌పర్సన్, డీసీసీబీ డైరెక్టర్ కంకంటి మంజులారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేకగూడ పీఏసీఎస్‌లో గురువారం ఆమె అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన ఎరువులు అందించడమే కాకుండా, రుణాలు సైతం ఇస్తున్నామన్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, సీఈఓ వినయ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


శంకర్‌పల్లి: చిల్డ్రన్స్ పార్కులో రోడ్లను శుభ్రం చేస్తున్న కమిషనర్ యోగేశ్, నాయకులు

మున్సిపల్ కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ–2025లో భాగంగా గురువారం మున్సిపాలిటీలోని వివేకానందనగర్ కాలనీలో ఏక్ దిన్–ఏక్ గంట–ఏక్ సాథ్ అనే నినాదంతో మాస్ క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ పార్కు, కాలనీలోని రోడ్లను, పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తీసివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి ఆనంద్, నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్, చంద్రమౌళి, మహిళా సంఘాలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్, అధికారులు

షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ–2025 కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఆధ్వర్యంలో ఒక రోజు, ఒక గంట, ఒకే చోట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లోనే వేయాలని సూచించారు. స్వచ్ఛతపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, సీడీపీఓ ఉదయ, ఏపీఓ అరుణ, ఏపీఎం జయమాలిని, పంచాయతీరాజ్ ఏఈ గోపాల్, ఏఈఓ నిషాంత్‌కుమార్, ఏఈఓ తేజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని సర్దార్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–1984 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు గురువారం షాద్‌నగర్‌లోని మల్లికార్జున బంకెట్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 41 ఏళ్ల తర్వాత వారందరూ ఒకచోట కలిసి ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వేదికపై పిలిచి ఘనంగా సన్మానించారు. ఆటాపాటలతో రోజంతా సందడి చేశారు. అనంతరం మృతి చెందిన పూర్వ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నివాళులర్పించి.. మౌనం పాటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


అంతారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని దేవరంపల్లి, నాంచేరి, ఇంద్రారెడ్డినగర్, కిష్టాపూర్, ఆలూరు, తలారం, తంగడపల్లి, మడికట్టు, కౌకుంట్ల, అంతారం, న్యాలట, కమ్మెట, గొల్లగూడ గ్రామాల్లో సీసీరోడ్లు, వీధిలైట్ల ఏర్పాటు పనులను ఆయన పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు గాను 9 కోట్ల 90 లక్షల హెచ్ఎండీఏ నిధులు విడుదలైనట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు ప్రారంభించామని, త్వరలోనే పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, సీనియర్ నాయకులు ఆగిరెడ్డి, పాండు, గిరిదర్‌రెడ్డి, వెంకటేశ్‌బాబు, హన్మంత్‌రెడ్డి, శశిధర్‌గౌడ్, తరుణ్, అనంతరాములు, యాదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మానిక్యరెడ్డి, రాజశేఖర్, మానిక్యం, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఆర్ డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు అభినందన

గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని కమ్మెటలో గురువారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి తన సొంత నిధులు రూ.3 లక్షలతో గ్రామంలో ఏర్పాటు చేసిన వీధిలైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డిని అభినందించారు.

రచయిత వెంకట్‌గౌడ్ మృతిపై సంతాపం

షాద్‌నగర్: ప్రముఖ రచయిత, తెలంగాణ వాది కొంపల్లి వెంకట్‌గౌడ్ మృతిపై ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గురువారం సంతాపం వ్యక్తం చేశారు. వెంకట్‌గౌడ్ హఠాన్మరణం తెలంగాణ సాహిత్య రంగానికి, ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన తన జీవిత కాలం ఆద్యంతం తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బహిరంగ ప్రకటన

శ్రీ మహమ్మద్ హాజీముద్దీన్ @ మహమ్మద్ హస్సోద్దీన్‌కు సంబంధించిన రిలీజ్ దస్తావేజు నెం. 6255/ 2022 కు లింకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు నెం. 4223/2003, 13348/ 2006, తేది 15–09–2025 రోజు మోటార్ సైకిల్ పై మెయిన్‌రోడ్ షాద్‌నగర్‌లో ప్రయాణిస్తుండగా పోయినవి. నా క్లయింటు ఎంత వెతికిన, విచారణ చేసిన పై దస్తావేజులు లభించలేదు. ఆచూకీ లభించిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు ముట్ట చెప్పగలరని మనవి.

Sd/- జె. అంజయ్య MA., LLB (అడ్వకేట్)
షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా. సెల్: 9848376749

దీన్ దయాల్ సేవలు చిరస్మరణీయం

షాద్‌నగర్: దేశానికి పండిట్ దీన్ దయాల్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాల్ జయంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లష్కర్ నాయక్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, మిద్దె గణేశ్, అనిల్‌కుమార్‌గౌడ్, రంగయ్య, కుడుముల బాల్‌రాజ్, రాజునాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్‌లో..

షాబాద్: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గురువారం పండిట్ దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దూరు మాణయ్య, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, పక్వాడ మండల కన్వీనర్ దాదె మహేశ్, కో–కన్వీనర్ రవిగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

అతిథి గృహంలో..

శంకర్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం పండిట్ దీన్ దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అతిథి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములు, వాసుదేవ్, పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహ, కృష్ణారెడ్డి, వీరేందర్, దండు మోహన్, ప్రవీణ్, లోకేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


షాబాద్‌లో..


శంకర్‌పల్లి: అతిథి గృహం ఆవరణలో మొక్కలు నాటుతున్న నాయకులు


చేవెళ్ల: పుష్కరిణి వద్ద మొక్క నాటుతున్న నాయకులు

వైభవంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు

- నాలుగోరోజు కొనసాగిన పూజలు
- మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకొంటున్నారు. గురువారం నాలుగోరోజు చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం, పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల వద్ద హోమం, కుంకుమార్చన, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు.



మొయినాబాద్‌రూరల్: కనకమామిడిలో..


షాద్‌నగర్: అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


శంకర్‌పల్లి: అన్నపూర్ణదేవీగా అమ్మవారు


కొందుర్గు: అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు


షాబాద్: పూజలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి దంపతులు


షాద్‌నగర్‌రూరల్: అన్నపూర్ణదేవీగా అమ్మవారు


చేవెళ్ల: దుర్గామాత పూజలో నాయకులు


చేవెళ్ల: మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564